
# విజయగీత

రచనః చింతలపూడి వెంకటేశ్వర్లు




rachanaonlinetyping.in
మీ రచనలు, సేకరించినవి మాకు పంపండి. ఇందులో ప్రచురిస్తాం
తెలుగు భాషకోసం - తెలుగు ప్రజల
కోసం అక్షరాభిషేకం
8919951771
9494421527
9441318641
రచయితలు సంప్రదించండి
• మెయిల్ ఐడి : kamyasiddhi@gmail.com
website: rachanaonlinetyping.in

## ఆవాహన

అన్ని వృత్తులు సమమంచు నాచరించి

వర్గభేదంపు గిరినుండి నిర్గమించి

పేద కుబ్జా కుచేలుర నాదరించి

శూద్రగృహమందు ప్రియమార సౌజ్జగుడిచి

మానవత్వంపు నిగ్గుల మేనదాల్చి

దానవత్వంపు నీడల హీనపరచి

విపులగతి ప్రేమతత్వంబు విస్తరించి

స్త్రీ సమానత్వ దీక్షను స్వీకరించి

నరకు చెరవడ్డ యువతుల కిరవుగూర్చి

ప్రేమపెండ్లిండ్ల కాద్యత బ్రీతిగూర్చి

రాజకీయంపు ధర్మముల్ రంగరించి

దేవపతి నియంతృత్వంబు ధిక్కరించి

ఆనువంశిక పాలన నుత్తరించి

సకలవిధముల సంఘంబు సంస్కరించి

వేదశాస్త్రంబు లను యావు వేడిపొదుగు

నరుని దూడగ కుడిపి మానవుల బుద్ధి
భాండమున గీతయను పాలు నిండునటుల
పితికి యిచ్చిన గోపాలు బిలుతు మరల !!!

విషాదం.....

ధర్మరక్షకు ద్వాపరాంతంబునందు
యుద్ధ సమరాగ్ని ధృతరాష్ట్రు సేనయెదుట
పాండవుల నిల్పి కృష్ణుండు పార్థుగూడి
తోత్రధరుడాయె నా కురుక్షేత్రమందు.
తాత భీష్ముండు సింహ నాదంబుజేయ
పాంచజన్యంబు హరి యూదె పార్థుడపుడు
దేవదత్తంబు బూరించె దివిని దేవ
గణము చూడంగ నని సేయ గడగి యంత-
రెండుమూకల సంకుల పిండు కూయ
నింగినేలలు గోలతో నిండిపోవ
నెదిరి వోకల గమనింప నెంచి తేరు
నడికి నడుపంగ నుడివెను నల్లవాని.

అన్నదమ్ములు తాతలు కన్నవారు
మిత్ర గురు శిష్య బాంధవ పుత్రసములు
పగతురైనిల్వ నటజూచె ఫల్గుణుండు
శౌరి చోదిత స్యందనాస్యంబు నుండి!
ఆత్మబాంధవ్య మొకవైపు ఆత్మప్రేల్చె
గురులయందలి సద్భక్తి గుండె బిండె
సుతుల హితులందు మమతలు మతినిగొట్టె
దుర్బలంబయ్యె గాండీవి దోర్బలంబు!

వశముదప్పిన నాడులు వదలివేయ
మేని శస్త్రాస్త్రభారంబు మీదబడగ
వీగిపోయిన విజయుని వెన్నుడంత
బావ! ఏమాయె నీకంచు పరిహసించె!
కృష్ణు హాస్యోక్తి మనమును గృహము జేర్చ
తేరుకొని సవ్యసాచి తాదేరు డిగ్గి
బేలపలుకుల గురుకుల హేలడిగ్గి
చెప్పుకొనసాగె దనుగన్న తప్పుగూర్చి.

వినుము గోవింద! నన్నింక వేచవలదు
జయము వలదింక భోగ సంచయము వలదు,
బంధురుధిరాన తడచిన ఫలము వలదు,
ఆత్మగురు హత్యపాతక మసలు వలదు.
కులము నశియింప కట్టడి కుంటువడును,
జంకు కట్టడినగు వర్ణ సంకరమ్ము,
నరులకంతట తిరమౌను నరక ప్రాప్తి
చత్తుగాకేను గొననింక చాపములను.
అనుచు గాండీవమును వీడి ప్రణతుడైన
పంచముఖుజేత ధృతి సుంత పెంచనెంచి
మించు సమ్మోహ పాశంబు ద్రెంచనెంచి
పంచశరుతాత గీతా విపంచి మ్రోసె.
ధైర్యమును గోలుపోయిన దైన్యమూర్తి!
రోసమునువీడి నిల్చితే బాసదప్పి?
చెలగు నిభయూధమునుజేరి సింహమకట
గర్జనముజేసె మార్జాల కంఠగతిని!

క్లైబ్యమునువీడి పొందు ముల్లాసమింత!

కీడునార్యాహితంబు నకీర్తికరము,

కరము నరకమ్ము గలిగించు కశ్మలమ్ము

కట! పరంతప నిన్నెట్లు కవిసెనయ్య!?

దంతి కుంభాస్థిమయ కలశాంతరాళ

సక్త మాంస కర్దమ రక్త సిక్త మౌక్తి

కాక్తరసయుక్త మస్తిష్క భుక్తిమాని

పూరి గరచునె సింగంబు పోర పెరచి?

పలుకు పలుకున కొక కొంత వదనమెత్తి

హరిని నాపైన పైనున్న హనుమజూచి

భ్రాంత మానసమున కొంత శ్రాంతినొంది

పలికెనిట్టుల గలత నా ఫల్గుణుండు.

గెలుపు యోటము లవి యట్లు నిలువనిమ్ము,

పోర- గురుభావమున తొల్గ బొందగల్గు

రాజ్య భిక్షాన్నముల నేది భోజ్యమగునొ

కృపణమతి నేను తెలియను కృష్ణ వినుము!

మోహ కార్పణ్య సందోహ గేహమందు
చిక్కువడియున్న నాకీవె దిక్కు బావ!
బయటపడు దారి చూపుమో పరమపురుష!
శాధిమాం! పాహిమాం! శౌరి! శరణు శరణు!!
అర్జునవిషాదయోగము సంపూర్ణము.

సాంఖ్యం....

అంచుదలవంచి విలపించు యంచదంత
రంగు నరురంగు పొంగ నుత్తుంగసంగ
రాభిముఖుజేయ నా పద్మనాభుడంత
సాంఖ్యయోగంబు వివరించె సాంతముగను
దుఃఖపడదగని వారికై దుఃఖమంది
పలుకుచుంటివి పండిత వరునియటుల
పుట్టి చచ్చెడి కట్టెల పుట్టలందు
మనసునుంచరు పండిత జనులు భువిని!

ఆత్మ దేహంబు ధరియించు నవనియందు
నరుడు వసనంబు ధరియించు కరణి వినుము
కట్టె బట్టలు విప్పుచు కట్టునట్టి
ఆత్మ నిత్యంబు సత్య మనంతమోయి!
ఆత్మరూపాలు నీవు నే నవని జనులు
ఎల్లలోకాలు భూతాలు నెల్ల జగతి
జగతి కౌమార యౌవన జరల గడచి
తిరిగి కౌమార దశనొందు దేహి యిచట.
పంచతన్మాత్ర జనితార్థ సంచయంబు
రాకపోకల నవి నికరంబు కావు
ఎవడు సమభావమున వాని నేలగలడొ
వాడెపో మోక్షసామ్రాజ్య వరముబొందు!
సమగతి సదసజ్జీవ దేహములదెలిసి
విశ్వసంవ్యాప్త మవినాశి విధము దెలిసి
అప్రమేయాత్మ జంప లేవనుచు దెలిసి
యుద్ధమును జేయుమింక సంసిద్ధి వడయ!

అవని చంపుదు చచ్చెద ననెడువాడు
షడ్వికారాల దోష వేషాల లోన
బ్రహ్మతత్వంబు వెదకెడు పామరుండు
సమయ సమయింప వాని కసంభవంబు!

తడవదెండదు కాలదు తరుగు వడదు
అంటదీనాటిదియుగాదు కంటవడదు
పడదు తలపుల చెదరదు పాతబడదు
రూపు మారదు శృతుల చిద్రూపమాత్మ!

అంతమేలేని ఆత్మకై చింతయేల?
నాశమొందెడి తనువుల నాశలేల?
తుచ్ఛ బాంధవ్య సంబంధ దుఃఖమేల?
సాధకునకిట్టి యనుమాన శోధ తగునె!

పోమ్ము నీవాడినట్లె కానిమ్ము సుమ్ము
ఆత్మకును చావు పుట్టుక లబ్బనిమ్ము
పుట్టునది యెట్లు గిట్టునో పుట్టునటులె!
అట్టియెడ నీకు చింతిపదెట్టి మాట?

తొలుత తుదలందు కనరాని తులువతనువు
నడుమ నగుపింప నద్దాన నడలదగునె!
పొలబుడగల నాడెడు బాలకుండు
చిదిపి కనరాక పోయెనం చేడ్చునటుల!

సురుచిరాత్మను వింతగ జూచువాడు,
గొప్పసరుకంచు వింతగ జెప్పువాడు,
వీనులొగ్గుచు వింతగ వినెడువాడు
నిక్కమెరుగడు నిజముగ నొక్కరుండు!
తనువు తెగుగాక ఆత్మ నాశనము కాదు,
ఆత్మ ప్రతిబింబముల జూపు అద్దములను
పగులగొట్టంగ పుట్టును పాపమంచు
చింతజేయుట క్షత్రియోచితము గాదు!
క్షాత్ర ధర్మాగ్ని ప్రేల్చెడి క్షత్రియుడవు,
నీదు ధర్మంబు యుద్ధంబు, కాదుభిక్ష-
దారితప్పుదువేని చే జారు కీర్తి,
పరముదప్పును ఘోర పిపంబు గలుగు.

మోహారము వీడి చనితేని మోహబలిమి
శౌర్యమేలేదు, నీకండ్రు శాత్రతతులు
పోరుబారెడు పుంజును పొడిచినటుల
నీచవచనాల నీ గుండె నేచగలరు!
పుడమి తలయెత్తుకొని తిర్గు పూరుషుండు
భండనోర్వని భీభత్సు డౌండు యిటుల
పరువుడిగి వైరి తిట్టంగ బ్రతుకగలడె?
చండరిపురాశి జెండాడి చచ్చుగాని!
పోర జచ్చిన స్వర్గంబు బొందగలవు,
పోరి గెలిచిన రాజ్యంబు భోజ్యమగును,
పోరవెరచిన నరకాన పోరు తప్ప
దెరిగి శాత్రవసంహార గరిమ గొనుము!
కమ్ము సుఖదుఃఖ లాభ నష్టమ్ములందు
జయపరాజయ దశలందు సమసుమతివి,
కొమ్ము గాండీవ దివ్య శరమ్ములెత్తి
లెమ్ము పోరాడ నీకు పాపమ్ము లేదు.

అనుచు కృష్ణుండు పలుకంగ నర్జునుండు
కర్మసంపర్కమును బొంది నర్మిలిబడి
కుడితిలోబడ్డ యెలుకట్లు కొట్టుకొనని!
అనుచు వలుకంగ భవనాశు డనియెనిట్లు.
ఏలనో యాత్మతత్త్వంపు టెరుకవలన
పిరికిపైతివి కర్మల బెరికిపైవ,
వినుము చెప్పెద సందియమనగనేల,
కర్మ సంపర్కమున నున్న మర్మమెల్ల!
పనికి వెనువెంట ఫలితంబు బయలుదేరు
నడుమనాపిన నిసుమంత చెడుగులేదు
లేశకర్మయు సంసార పాశములను
కత్తి పెనుమాను నరికిన ట్లుత్తరించు!
ఫలితమాశింపరాదట్టి పనినిజేయు
నపుడు, తాజేయు చున్నాడ ననగరాదు,
భయము గర్వమ్ము మదిజేర పనికిరావు,
తప్పదనుకొంచు విసుగుతో దగదు చేయ!

వేత్తకొక్కటె యాత్మవివేక బుద్ధి,
పతితులకునుండు నెన్నియో పాడుమతులు,
కామ్యకర్మల సంగతి గలుగువారు
మోక్షఫలమిచ్చు తరువును ముట్టలేరు!
వేదముల జెప్పబడినట్టి వాదమెల్ల
ననుసరించిన గలిగెడు జ్ఞానమెల్ల
కామ్యరహితాత్ముడై చేయ గల్గుగాదె!
చిటికెడుప్పుకు సంద్రమ్ము చిలుకదగునె?
కర్మచేయుటె నీవంతు కాని, దాని
ఫలమునకు కారణము కావు తెలిసికొనుము,
సిద్ధి కలిగిన కాకున్న బుద్ధిగలిగి
సమ మనస్కుడవై కమ్ము సాధకుడవు!
హేయమది ఫలితము గోరి చేయుకర్మ,
కృపణుడగు నట్లు చేయంగ కృష్ణవినుమ!
అతడు పరలోకములకేగి యచటనైన
నసలు పరమాత్మ దెలియక మసలుచుండు.

పాప పుణ్యాల బొందదు పరమబుద్ధి,
బుద్ధి కలుగును నిజయోగ సిద్ధివలన,
సిద్ధి నిష్కామకర్మచే సిద్ధమగును-
క్షణిక వైరాగ్యచింతచే కర్మవిడకు!
సమత మోక్షార్హుడగు సుమ్ము సత్యవేత్త,
మోహకలుషాబ్ధి దరియించి మోక్షమంద
వినిన విననున్న వాద నిర్వేదమంద
గలవు, దరిజేరబొందు నిశ్చల సమాధి!
సమత నాత్మానుభూతిని సంతరించి,
మదిని జనియించు యాశల వదలునెవడు,
అతడె పుడమిని స్థితప్రజ్ఞుడనగ జెల్లు,
వాని నడవడి వివరంబు వినుము పార్థ!
ఇష్టములపొందు నాశింప నిష్టపడడు,
ఇష్టములపొందు తప్పిన కష్టపడడు,
శుభము వడసిన సంతోష శోభగనడు,
శుభము తప్పిన పరితాప శూలగనడు!

ద్వేష రాగ దంతద్వయ భూషితంబు
మత్త మాయాకరీంద్రమ్ము నుత్తరించి,
పాంచభౌతిక చర్మంపు పాతజుట్టి
భిక్షువై బ్రహ్మతత్త్వంపు భిక్షవడయు!
ఊటలైదింటి మూయు తాబేటిరీతి,
నాకలెరుగడు, తలపుల కాకపెట్టి
చిత్తమున్నిల్పు ననుజేరు చింతజేసి
పృథ్వదెస చూడ్కునిల్పు జాబిల్లు వోలె!
జగతి సంపదజూడ నాసక్తి గలుగు,
దానగోరిక నద్దాన దపన గల్గు,
దాన సమ్మోహ మద్దాన దగులు మరపు,
మరపు నశియింపచేయు సన్మతిని, గతిని!
పొందనగునట్టి యానంద మొందుచుండి,
రక్తి వైముఖ్యములనుండి ముక్తినొంది,
కడలి నందమ్ముగాసాగు పడవరీతి
బ్రతుకు సంసారి సతతంబు ప్రజ్ఞపరుడు!

కడలినల వోలె నటు నిటు మిడిసిపడుచు
కామ్య శాంతంబు నందడు కామకామి,
శాంతి లేకున్న బ్రతుకున కాంతిలేదు-
బ్రహ్మసంసర్గ సంభోగ భాగ్యమెటుల?
కన్ను చెవి ముక్కు నాలుక కప్పుతోలు
ఐదు గుర్రాలు, వాటిని గుదుటగట్టి,
బుద్ధిరథమును ద్రోలంగ శ్రద్ధగలిగి
భవము తప్పును, శాంతి సంభవము నిజము!
అట్టి గుర్రాల కళ్ళాల పట్టవేని
మనసునాడించు నవి యాట మర్కటమటు,
సుడికి గాలికి కెరటాల వడికి జడికి
కొట్టుకొను నావవలె మది కొట్టుకొనును.
భోగులకు నిజ జ్ఞానంబు బోధపడక
మిగుల చీకటినది రాత్ర మగుచుదోచు,
యోగులకు జ్ఞానరహితమై భోగజగతి
మిగుల చీకటినది రాత్ర మగుచుదోచు.

నదులనన్నిటి దనలోన నదుముకొనియు
గలతవడనట్టి లోతైన కడలి యటుల
ప్రకృతిశక్తుల జెదరని బ్రహ్మనిష్ఠ
శాంతినొసగును చేర్చు ననంతు తుదిని!

సాంఖ్యయోగము సంపూర్ణము

## నిష్కామ కర్మ

---

అటులనంతుం డనంతాత్మ కిటుకుదెలుప
నవధరించెడు విజయుం డనవగతమున
మిన్నయౌ జ్ఞాన యోగమ్ము సన్నుతించి
కర్మజేయంగ చెప్పెడు కతమునడుగ-
కృష్ణయోగీశ్వరుండంత దృష్ణలేని
కర్జమొనరించు విధిజెప్పె నర్జుననకు-
సాంఖ్యమున జ్ఞాన యోగమ్ము సాధకంబు,
యోగమున కర్మ యోగంబు యోగ్యమనుచు.

చేతలుడిగిన మాత్రాన చిత్తమందు
కర్మ శూన్యత కలుగదు దుర్మతునకు,
విహితకర్మల భవరోగ వేదనంబు
నాశమొందును కర్మ శూన్యతయు గలుగు.
జ్ఞానమున జూచు నాత్మ నజ్ఞాని యదియు
కర్మ శూన్యత వలననే కలుగునింక
బ్రహ్మచారిగ సన్యాస పథముబట్ట
పరమతత్త్వంబు నొందడు పామరుండు!
పుడమి బుట్టిన ప్రతి ప్రాణి యొడలు కదులు
ప్రకృతి యిచ్చిన సహజంపు పంటయద్ది,
గుణములకు లొంగి పురుషుండు గుములు, యుక్త
కర్మమెద్దియొ తెలుపక కలచు మాయ.
పైకి పదిమందిలో పాడు పనులు మాని
మనసులో నట్టి చింతల మాననట్టి
మూఢమతి కపటాచారముల జరించు,
వాని దూరుదురు బుధులు పాపియంచు.

తనువు జీవింప వలయును తత్త్వమెదియొ
తెలియువరకైన- అందుకై తిండికైన
కర్మజేయంగ వలయును కనుక నీవు
కర్మజేయుము నియత మార్గంబునందు.

ప్రజల సృజియించుచునె చెప్పె బ్రహ్మ వారు
యజ్ఞములజేసి సురగణ ప్రజ్ఞ బొగడి,
కామితములంది తిరిగి తద్గణము దనిపి
తినగ నొండొరులు గలసి చనగనెపుడు!

బ్రతుకునన్గొన్న యర్థంబు బ్రకృతియందు
పెద్దలకు, తోటివారికి, పిద్దెలకును,
జంగములకెల్ల పంచి తక్కుంగలద్ది
యనుభవింపంగ వలె, కాక యధముడగును!

అన్నమున బుట్టు భూతంబులన్న ప్రాప్తి
వర్షమునగల్గు, యాగాల వానకురియు,
కర్మలన్ యాగములు గల్గు, కర్మ బ్రహ్మ
ఫలము, బ్రహ్మయు పరమాత్మ వలనబుట్టు!

కనుక ప్రతివ్యక్తి కర్మచే గట్టువడగ
వలయు నటుగాక యుండిన వ్యర్థుడగును,
ఆత్మసంతుష్టి తృప్తియు నాత్మరతియు
గలుగు నతనికి కర్మ సంగమ్ములేదు.
జనకుడాదిగ జ్ఞానులు జనులహితము
గోరి కర్మలజేయరే కుంతి తనయ!
సర్వమేనయ్యు గర్మల సలుపలేదె!
ఒరుల కొరవడిపై నీవు పెరుగుమయ్య.
ఫలమునాశించి యజ్ఞాని సలుపు కర్మ,
కర్మసంగుల కర్థంబు కాని బోధ
మాని యుక్తాచరణమును జ్ఞాని పూను-
జనులు సత్కర్మ పరులయి మనుటకొరకు.
ప్రాకృతములైన గుణముల ప్రకృతిగతికి
నీవు కర్తవుకావను నిజము దెలిసి
కర్మలన్నియు నాయింటి గాటగట్టి
సంశయాత్మను విడి లెమ్ము సమరమునకు.

ఎవడు నామాట చెవిబెట్ట కెదురుదిరుగు
నతడు మూఢుడు అవివేకి అధముడగును,
బాహ్యబంధాల లోగక స్పృహ్యమెరుగు
నతడు నావాడు, సర్వమున్నతని సొత్తు!
ఎడద నోటిని యూరించు యెదుటి చెయిద
మోగు, నిజధర్మమున కన్న బాగుకాదు,
పేయ నిజధర్మనిష్ఠయే శ్రేయమగును,
హేయ పరధర్మమున మది హెచ్చు భయము.
నివురుగప్పిన నిప్పట్లు మావిలోని
శిశువువలె కామవశమైన చిత్తమెరిగి
ఆత్మతత్త్వంబు బుద్ధిచే నందుకొనుము,
బంధముక్తుండపై కొమ్ము బాణములను!
నిష్కామకర్మ యోగము సంపూర్ణము.

జ్ఞానం

ఆది నాదిత్యునకు నేను యూదినట్టి
యోగమిది పొందుమన్న ఆ యోగివరుని

సూర్యుడెప్పటివాడు నీ చుట్టరికపు
రీతి యెటువంటిదని యా కిరీటి యడిగె!
జన్మవిషయిక జ్ఞానంబు సవ్యసాచి
కిటుల వివరించె కృష్ణుండు పటుతరముగ
నాకు నీకును గతమం దనేక జన్మ
లాయె గతినౌట విదితంబులాయె నాకు!
అజుడ నవికారుడను జీవభజుడనయ్యు
మూలధర్మంబునం గ్లాని పుట్టినపుడు
పాపులంజంపి సాధు సాధ్వసము బాప
ధర్మ సంస్థాపనార్థమై ధరజనింతు!
రాగ భయ క్రోధముల వీడి యోగమూని
నాదు జన్మంబునెరుగక లేదు ముక్తి
ఏ విధిని నన్ను బూజింప నా విధమున
భక్తులనుగాతు నెల్లర ముక్తి గోరి!
ఐహికాకాంక్ష నెల్లరు ననిమిషార్చ
నంబుజేతురు మనుజ లోకంబునందు

పుణ్యకర్మల జిరసిద్ధి పొందవలయు
కర్మఫలసిద్ధి యిటవేగ కలుగుగాన!
జగతి బ్రజలెల్ల సత్త్వ రజస్తమోగు
ణంబులందెచ్చు తగ్గు సమంబులగుట
నమరజేసితి నాల్గు వర్గముల మున్ను
సంఘగమనమ్ము సరిదారి సాగిపోవ!
సంఘశ్రేయంబు కొరకునై జరిగినట్టి
సంఘవిభజన వంశానుసారమైన
కులములెన్నియో నాళ్ళట్లు నిలువలేవు
పంటమార్చక పొలములు పండనటుల!
మానసికవృత్తి కేవృత్తి మానమగునో
తగనదియ చేకొనంగ స్వధర్మమగును
కర్మపంకోద్భవంబైన కలువయగుచు,
తనదు ధర్మంబు నెరపు నాతండె బుధుడు!
ఎన్నిచేసియు నే నెటులన్నిట నొక
కర్మకేనియు కర్తను గాకయుంటి

కనుము, కర్మ యకర్మ వికర్మ లెరిగి
కాంచుమొండొంట కర్మ నకర్మ నెలమి!
కామ సంకల్ప వర్జిత కర్మభుక్కు
ధర్మ ప్రజ్వల జ్ఞానాగ్ని దగ్ధకర్మి
భంగ చిత్తార్తి మాన నిస్సంగుడగుచు
బ్రతుకదగు మాత్ర మార్జించు బ్రధితకర్మ!
శుద్ధ యాదృచ్ఛికపు లాభసిద్ధి దనరు
సిద్ధ్యసిద్ధుల సముడు నిషిద్ధ మత్స
రుడు గుణద్వంద్వ దమనుండు బడుగుకర్మ
లతనికై చేయు గనుకవి యంటవతని!
సర్వసామగ్రి సత్కర్మ సాధనమున
రూపమునుగొన్న బ్రహ్మ స్వరూపమంచు
జేరి వేదార్థ యజ్ఞ సంచారివైన
దాటగలవు సంసార బంధాలనుండి!
సంయమ జ్ఞాన దేవాత్మ సంయమేంద్రి
య తప ప్రాణ కర్మద్రవ్య యతయ సంశి

తవ్రత నియతాహార శాస్త్రజ్ఞ యోగ
మాది వహ్నుల యజ్ఞమ్ము వేదహితము!
జ్ఞాన యజ్ఞాంతరంబున లీనమగును
సకల ద్రవ్యార్జనాత్మక సాధనములు
మోహముక్తత నెల్ల జీమూత పరిధి
గడచి నీలోనె నిఖిలంబు గాంచగలవు!
శ్రద్ధ తత్పరత నిగ్రహాశ్రయములంది
సంతతాభ్యాస నిరత యోగాంతమందు
తప్పుటుప్పెన నొప్పెన తెప్పసత్తు
గతికి యుత్కృష్ట చిత్తోపరతిని బొందు!
హితుల యుపదేశమును విని బ్రతుకు తెలివి,
దాని యుబికించు తెలివియు లేనివాడు
సంశయాత్మత జ్ఞాన సంస్పర్శ లేక
మోక్షమే కాదు సుఖలేశమున్న గనడు!
తప్తయోగాంత కర్మ సంతృప్తమతిని
ఛేదితానంత సందేహ వేదివగుచు

సాధు పరమార్థ విజ్ఞాన సాధనమున
కర్మమొనరింప లే లెమ్ము కదనమునకు!
జ్ఞానయోగము సంపూర్ణము.

## కర్మ సన్న్యాసం

లెమ్మనెడు కృష్ణుజూచి మనమ్ములోని
సందియము దీర కాధీర సవ్యసాచి
కర్మ చేయుటొ వీడుటొ ఖచ్చితముగ
ఆచరణ యోగ్యమేదియో తూచుమనియె.
సందియంబున గుందు ఆ బొంది పురికి
కర్మసన్న్యాసమునకన్న కర్మయోగ
మెక్కుడని యిట్లు చెప్పె నా ప్రక్కిరేడు
అన్ని యాగాల యోగాల వెన్నదొంగ!
ఫలములొకటయ్యు యోగమందొలుకు బ్రహ్మ
ద్వేష కాంక్షల లోగక కృషిని జేయ

నిత్యసన్న్యాసి యననోపు నిక్కమతని
కర్మవీడిన సన్న్యాసి కపటయోగి!
కనులుమూసిన తెరచిన కనిన వినిన
మాటలాడిన మానిన మైథునమున
నిదురపోయిన మేల్కొన్న చదువుకొనిన
తినిన నేమైన దెలిసియు తెలియరాదు!
తామరాకులు నీటిలో తడియనటుల
కాయ మానస బుద్ధి రింద్రియములజను
కర్మలన్నియు విషయ సంగమ్ము నందు
నంటువడకుండ మనవలె ననవరతము!
సాజమగు చేతలన్నిటి సర్దుమింక
తూట్లు తొమ్మిది గలయట్టి తోలుతిత్తి
నిలను యుక్తుండ వగుము యేమెరుగనటుల
కాయబోయెడి కాయల కాంక్షలేక!
అబ్జహితుడహల్యా ధ్వంసి యైనరీతి
నజ్ఞతన్ చంపి సుజ్ఞాన ప్రజ్ఞ బడసి

ప్రకృతి కర్మఫలాసంగి ప్రభుని గూర్చి
పాప పుణ్యాల గురివీడి ప్రతిన గొనుమ!
వీత యజ్ఞానిపై నీవు విహితబుద్ధి
వాద నిష్ఠా పరాయణత్వముల నెల్ల
జేర్చి పరమాత్మలో జొప్ప జేయుమపుడు
తిరిగి జన్మంబు వొడమదు దీర్ఘబాహు!
వినయ బ్రాహ్మణ గో గజ శ్వాన పక్షు
లెల్ల వర్గాల సమదృష్టి వెల్లివిరియు
విజ్ఞతంబొందు మంత నీ యజ్ఞమందె
బ్రహ్మగందువు, యుందువు బ్రహ్మమందె!
ఇనుపరజనె ట్లయస్కాంతమును వరించు
నట్లు పరమాత్మనంటిన ఆత్మజ్ఞాని
బ్రహ్మవాసంబునన్ ద్వంద్వ ప్రకృతిగనడు,
ఆత్మవత్సర్వభూతాని యనగ నడచు!
మృత్యువునకన్న మున్నుగా భృత్యువృత్తి
వీడి తనురాచకొలువును వీడి బ్రహ్మ

కొలువుజేర నతడు బహుసులువుగాను
అంతమేలేని యానంద వంతుడగును!
కామ క్రోధోద్భవంబుల గాయు బుధుడు
నిగ్రహేంద్రియుడగుగాన సెలవుజేరి
దుఃఖభాగురము సకల దోషహేతు
వనుచు నింద్రియ సుఖమును వదలిపేయు.
అంతరమునందు సుఖములనందువాడు
అంతరారాము డంతర క్రాంతుడగుచు
పాప సంశయ రహిత చిత్తోపయోగి
యోగియై బ్రహ్మనిర్వాణ భోగియగును!
దృష్టి భ్రూమధ్యమున నిల్పి, సృష్టిసలుపు
నను నెరింగి, ప్రాణాయామమున దరించి
అవనియందుననే యాత డవధిలేని
నిశ్చలానంద మొందును నిశ్చయంబు!
కర్మసన్న్యాస యోగము సంపూర్ణము.

## ఆత్మ సంయమనం

కర్మయను నిచ్చెనెక్కిన గాని ప్రాణి

సున్నితపు జ్ఞానమును పొంది సుఖముగనడు,

ఫలముగోరక కర్మల సలుపునెవడు

వాడు సన్న్యాసి, యోగియై వరలునిజము

జ్ఞాని కర్మనివృత్త యజ్ఞమును జేయు,

నింద్రియార్థాల నాసక్తి నెత్తివేసి

సర్వ సంకల్ప సన్న్యాసి సత్యవేది

యనగ లోకమ్మునందున వినుతికెక్కు!

మనసు పడనట్టి మనసుచే మానవుండు

పైకి పయనించవలె, కాదు పతనమునకు,

సూత్ర బంధంబున మనము మిత్రమగును

సూత్రబద్ధంబు గాకున్న శత్రువగును.

జిత మనంబది బంధువు, జీతగాడు,

నిలుపు శాంతము బరమాత్మ నెలవుజూపు

నిలచు నిర్ద్వంద్వమై తాను మెలగు లోంగి
జితముగాకున్న జేతయై చిత్తుజేయు!
లోష్ట కాంచనముల నొక్క దృష్టి జూచి,
శత్రు మిత్రాదులందొక్క చనవు జూపి,
జ్ఞాన విజ్ఞాన తృప్తాత్ము డైన యింద్రి
య జిన కూటస్థుడౌ యుక్తు డగును యోగి!
చదునుగానుండు తగుయెత్తు చట్టుపైన
దర్భ కృష్ణాజినముల మీద వసనమును
పరచి కూర్చొని మనసును పదిలపరచి
ధ్యానమేకాకియై సల్పు ధ్యానయోగి!
బ్రహ్మచర్యంబు బాటించు, భయముదీరు
బాధలకు లోగ డింద్రియ బంధమూడ్చు,
నిల్పు దేహము స్థిరముగా, నిల్పు నిగిడి
ముక్కుకొనపైన చూడ్కులు నిక్కజూచు.
నియమితాహార నిద్రాది క్రియలవలన
నిఖిల మానసప్రకృతుల నిగ్రహించి

తిరుగు బుద్ధిని నిర్వాత దీపమట్లు
నిలిపి నిష్కాముడై నన్ను కలియగోరు!
దేన శాంతించు చిత్తంబు, దేనబొందు
నింద్రియాలభ్య సానంద చంద్రికలను,
దేన దుఃఖంబులేదు, బాధింపదెద్ది,
రాగమున ద్రోయ దద్దాని యోగమండ్రు!
ఎందుగనరాని లాభమ్ము నందజేయు
యోగ మభ్యాస మొనరించి భోగ లాల
సతన దిరుగాడు మనమును సత్త్వబుద్ధి
చేతనాత్మలో జొప్పింప జేయు యోగి!
యోగలగ్నాత్ముడై నిజయోగ మహిమ
దమ రజోగుణముల ద్రోలి తనదులోన
సర్వభూతాళి జూచును, సర్వమునను
తన్ను జూచును సమదర్శి మున్నుగాను!
అన్నిటను నన్ను, నాయందు నన్నిటిన్ని
చూడజాలిన నంత నవ్వాడు నాకు

నెదురుబొదురుగ నిల్చు, నెమ్మదిని నన్ను
మననజేయంగ నాయంద మనుమునిజము!
సంతతాభ్యాస వైరాగ్య సాధనమున
చంచలాజేయ దుర్నిగ్రహాంచితాప్త
దుర్గమంబైన మనమును మర్దనంబు
చేయగావచ్చు దీన సంక్షేమమొందు!
మరణముననైన, వీగని మనమునైన
బ్రహ్మప్రాప్తికి పూర్వంబె భ్రష్టుడైన
యోగి పొందును సాధిక బాగుబట్టి
పుణ్యలోకమ్ము లాపైన పుడమి బుట్టు!
పుట్టు కలవాని యింట చేపట్టు సుఖము,
లేక నేయోగి యింటనో సేకరించు
పుట్టి తగినట్టి సాధికం గట్టి ఫలము,
వట్టిపోవదు యోగంబు నట్టనడుమ!
జన్మ జన్మల పాప సంచయమునెల్ల
బారద్రోలును యత్నమ్ము వలన యోగి,

శిష్ట పండిత జ్ఞాన కర్మిష్టులాది
వరుల మించెడు నా యోగి వరుడవగుము!
ఆత్మ సంయమన యోగము సంపూర్ణము.

## విజ్ఞానం

యోగమనియెడి ప్రౌఢాస్త్ర యోగమహిమ
గూల్చవలసిన మాయలో గూఢ గరిమ
తెలుపుమను పార్థునకు శౌరి తెలిపెనిటుల
ప్రకృతి విజ్ఞానయోగమ్ము ప్రకటముగను!
ప్రబల భేదంబులెనిమిది ప్రకృతియందు
నింగి నేల గాలియు నీరు నిప్పు మనసు
బుద్ధ్యహంకారముల పేర బొక్కు నిహము,
మాయ పటమును ఊడలై మోయుచుండు!
సూక్ష్మ గతులను చరియించుచున్న యట్టి
అష్ట భేదంబులను కూర్చి సృష్టి సలిపి

ఇహము రూపొంద జేసెడు మహితశక్తి

నాదు ప్రకృతిగా తలచుము నరవరుండ!

జగతి బుట్టింప గిట్టింప జాలుశక్తి,

ఈడులేనట్టి లోకంబు లేలు శక్తి,

దండలో దారమై సృష్టి దాల్చు శక్తి,

భూతగత కాంతి శబ్దాది భూత శక్తి,

ప్రథమ వేదోద్భవంబైన ప్రణవ శక్తి,

భేదప్రకృతికి తిరమైన బీజ శక్తి,

జీవతతియందు తొణుకాడు జీవ శక్తి,

మూడు గుణముల గరిమకు మూల శక్తి,

అన్ని శక్తుల పుట్టుపై యున్నవాడ!

మాయమోహిత జగతికి మాయకాడ!

చెలిమి జేసిన మార్గంబు జూపువాడ!

మాయ ఛేదింపగల వారి గాయువాడ!

చెడుగు పనులను జేసెడు బడుగువారు,

కూడదంచును చెడు చేయు కుటిలమతులు,

నన్నునెరిగియు నా శక్తి నెన్నువారు
మోక్షమున నన్ను జేరని మూర్ఖమతులు!
భీతి దపియించువారు, వినీతి నెరుగ
కోరుకొనువారు, పరమాత్మ గోరువారు,
ఆత్మనెరిగిన వారును నభవమైన
నన్ను పొందంగ దపియించు నాల్గు తెగలు!
ఎవ్వడే రూపమున నన్ను నెద్దికోరి
ప్రార్థనముచేయు నద్దాని ప్రాప్తినందు,
జన్మలన్నిటి గడచిన జ్ఞాని చివర
హాయి నను జేరజాలు మహాత్ముడగును!
పుట్టినంతనె తనువున బుట్టు భ్రాంతి,
నియత యాజ్ఞిక మార్గంబు నిష్ఠ సలుపు
సుకృత కర్మంబు భ్రాంతిని వికృతిజేయ
నతడు నాలోన లీనమౌ నంతమందు!

విజ్ఞానయోగము సంపూర్ణము

.

## అక్షర పరబ్రహ్మం

అటుల పలికెడు పరమాత్ము నాత్మబోధ
విని పరంతపుడిట్లని విన్నవించె
పుట్టుకకు నందులో భ్రాంతి పుట్టుటకును
గిట్టి నినుజేరుటకు సెద్ది గుట్టటంచు.
పార్థు యురియాటదీర్ప నా పాపనాశి
పలికె పుట్టుట గిట్టుటల్ కలుగు విధము
అక్షరంబైన బ్రహ్మ ప్రత్యక్ష భావ
మన్ని భూతాల నధ్యాత్మ మనగ దనరు!
పుట్టి నశియించు అధిభూత పురములందు
పురుషుడధిదైవతము గాగ పరిఢవిల్లు,
జగతి నధియజ్ఞతన్నేను సలుపు కర్మ
పుట్టుటయు, గిట్టుటయు, పుట్టి గట్టు బడుట!
వివిధ నక్షత్ర గ్రహాయుక్త విశ్వమెల్ల
ఎవనియందుండి పుట్టెనో ఎవనియందు

లీనమందునో అవ్వాని లీల మాత్ర
మును గనగలరు విజ్ఞాన మూర్తులెల్ల!
మరణమాసన్నమైనంత నరుడు తాను
విత్తుకొనుసెద్ది యేకాగ్ర చిత్తమందు
అద్ది ఫలియించు జన్మాంతమందు నిజము,
జన్మరాహిత్యమును గోర జన్మలణగు!
బ్రహ్మవాచక మోంకార ప్రణవమూది
యోగబలమున ప్రాణ వాయువులబట్టి
కనుబొమల మధ్య బిగియించి కనులు మూయు
యోగి యైహికబంధ వియోగి యగును!
మదము మాత్సర్యమను రెంటి మాయజేసి
చేతనము సుంత దిటవుగా జేసి నన్ను
జీవితాంతమ్ము స్మరియించు జీవి చివర
సులువుగా నొందు మోక్షమ్ము సూక్ష్మగతిని!
ప్రణవ యోగానుకూలమై ప్రముఖమైన
కాలనియమమ్ము చెప్పెద నాలకింపు

ముత్తరాయణ మొనగూడ నుత్తమంబు,

దక్షిణాయణమైన నధమ ఫలమగు!

మనసు నూర్ధ్వాభిముఖి యగు మంటజేసి

పగటివెలుగుల శుద్ధ విపాక బుద్ధి

నుత్తరాయణ క్రాంతిని సత్తుగోరి

ప్రణవమొనరించ ముక్తి సంప్రాప్తమగును!

ధూళి దూషిత తమమున దుర్బలమగు

క్షుద్రపూజల సలిపెడి రౌద్రగతిని

దక్షిణాయణ మాంద్యత దపమొనర్ప

వృద్ధి క్షయముల దుఃఖ నివృతియొకాదు!

వేదమున, యజ్ఞ తప దాన విధులనెందు

గనని ఫలితంబు కూడు యోగంబునందు,

కనుక అర్జున! వేగ యోగంబు నందు

బుద్ధి లగ్నంబు సేయుము సిద్ధివడయ!

అక్షర పరబ్రహ్మయోగము సంపూర్ణము.

## రాజవిద్య

మరియు నతి రహస్యము శ్రేష్ఠమైనయట్టి
ధార్మికావ్యయ జ్ఞాన బోధనము వినుము,
బ్రహ్మమొదలు పిపీలికా పదము వరకు
నాదులోనుండు కాని నన్నంటదెపుడు!
అష్టభూతంబులుండు నా యిష్టమందు,
వానికాధారమును నేను, భర్త నేను,
కాని వాని యధీనమం దేనులేను-
మూఢు లవ్వియె నేనంచు మ్రొక్కుచుండ్రు
వాయు వాకాశమున నెట్లు మూయబడునో
అణువు నణువునగల పరమాణు శక్తి
అమరు నట్టుల నా యంతరాంతరమున
సాంతముగ నన్ను దెలియుము స్వాంతమందు!
ప్రళయవేళల విశ్వమ్ము ప్రణవమందు
లయముజెందును మరల పల్లవమునొందు

అస్వతంత్రపు సృష్ట్యాదుల స్వరూప
సరళి నా మాయజాలంపు సరసకేళి!
నాదు కనుసన్నలందు యీ భేదజగతి
నాట్యమొనరించుటే గాని నాకునెట్టి
బంధమును గూర్చ నేరవు, కంధరమును
మీనులెన్నియు బట్టంగ లేని విధము!
ప్రకృతి సౌందర్యమున పెను ప్రభలజిక్కి
యెచ్చులాడుచు పాపి న న్నీసడించు,
తిరముగలిగిన సంతులు పరము నెరిగి
ధృఢవ్రతంబున నన్గొల్చు ధృవముగాను!
సర్వ యజ్ఞమ్ములును నేను, సర్వమేను,
తెలియదగినట్టి గురి నేను, తేటనేను,
చేరదగినట్టి దరి నేను, చిరము నేను,
కాలమునునేను, కారణ కార్యమేను!
అన్య చింతలుమాని యే మాన్యమైన
దైవతత్త్వంబు గొల్చిన నా వరంబు

నిచ్చువాడను నేను, పైపెచ్చు వారి
యోగ సంక్షేమముల జూతు యోగ్యవిధిని!
వైదికమ్ముల ఫలిత నివేదనమ్ము
ననుభవించెడువాడ నేనంచు మరచి
నాకసౌఖ్యాలు మున్ను గ సేకరింప
జన్మ ముల జేయునట్టి యజ్ఞానమతులు
కొంతకాలంబు మాత్రము సంతసంబు
ననుభవించిన పిమ్మట నవని దిరిగి
జన్మమెత్తుట నిక్కమ్ము, సాహసమున
నన్ను జేరంగ నిష్కామనమును జెల్లు!
ఆకొ పూరేకొ తీయని శాకజలమొ
భక్తిగలిగిన యేకొద్ది భుక్తిసైన
దృష్టి పడువాడ, అఘముల ద్రుంచువాడ,
తనదు కర్మల నాకు దత్తంబు జేయ!
ఇష్టము నయిష్టమును లేని శిష్టమతిని,
సకల ప్రాణుల సమదృష్టి సాకు పతిని,

వాడు, వీడను పనిలేదు వెదుక నన్ను,
దుష్టుడైనను నను జేర శిష్టుడగును.
నీచ జన్మంబునం గర్మ నీచుడైన,
మాంద్య ప్రకృతిని చెడిన దుర్మార్గుడైన,
నన్ను కోరినయంత సన్మార్గుడగును,
అక్షయంబగు, చిరమగు మోక్షమందు!
రాజవిద్యా రాజగుహ్య యోగము సంపూర్ణము.

**విజయగీత—విభూతియోగః–చింతలపూడి వెంకటేశ్వర్లు**

కోటి యంశల నొకదాని కోటి గోట
బ్రహ్మ ప్రభవించె నందులో ప్రభవమందె
చాల సప్తర్షిమండల చయములందు
మనువులు వరుస బ్రభవించి రనువునిటుల!
మండలంబున కోట్లాది చండభాను
గోళములు పుట్టి బ్రహ్మాండ గోళమెల్ల
కాంతి వెదజల్లె నందున గ్రహములెల్ల
పుట్టి పుట్టించె సకల సంభూతవితతి!

సందరమ్ముున నిసుమున సందునుండు
మంటి రేణువువలెనున్న మానవుండు
నన్ను దర్శించి తెలిసి కొన్నంత చాలు
తనదు యునికిని గ్రహియించు, మనును తెలిసి!
అట్టి మనుజుండు నను జేరుటొట్టి మాట
కాదు, నేజెప్పు నిష్కామ కర్మయోగ
మందు దరియించి నా స్థాన మందు నిజము,
అనవరతము బ్రహ్మానంద మనుభవించు!
అని విభూతిని వివరింప ధనవిభుండు
నరుడు వేడె ముముక్షుపై తిరుగ నిటుల
హే పరాత్పర! నీ దివ్య రూపుదెలియ
నిల గటోదుల మజ్ఞాన బిలములందు!
స్థూలదృష్టిని మనుజుండు చూడగలుగు
నీదు రూపంబు యెటులుండు నేదిదారి
కలదు? నినుజూచు భాగ్యంబు కలుగుటెట్లు
కరుణ జెప్పుమటన్న శ్రీకాంతుడనియె!

సర్వ భూతాశయాశంస పర్వశోభ
దనరగాన్వింతు నో పార్థ! ధరణియందు
భూతసృష్టికి ప్రగతికి పొలయికకును
కారణుడగాన నరసిన యారమందు!
ద్వాదశాదిత్యులన్ విష్ణుడ, దినకరుడ
రుచుల, సప్తవాయువుల మరీచిని, కన
దారలం జంద్రుడ, నలు వేదములయందు
సామమును, దేవతల నింద్రనామయుతుడ.
మనసు నింద్రియముల, భూతముల దెలివిని,
రుద్రులందున శంకరు, నద్రులందు
మేరువును, వసువుల నగ్ని, నేరులందు
గంగనై సిద్ధులందున గపిలునౌదు!
ఆయుధమ్ముల వజ్రమ్ము, నంబురాశు
లందు సంద్రమ్ము, బక్షుల యందు గరుడు,
నెల్ల వృక్షాల నశ్వత్థ, మెల్ల పాన
ముల నమృతము, వాక్కు బ్రణవమును దలంప!

శ్రేష్ఠవాచకమేదని నిష్ఠ తోడ
నాదు రూపమ్ముగా దమ యందు నిల్పి
కొలిచినంజాలు నవ్వారి గోర్కులెల్ల
దీర్తు, సకల శుభంబుల గూర్తు పార్థ!

## విశ్వరూపం

అంత నో యనంతుడ నాకు వింతదోచు,
అంతవాడవు నాముందు యింత చిన్న
రూపమున – బావపై యుండ – చూపుమసలు
రూపమైశ్వర్యునై నే పురోగమింప!
అనెడు నరుపైపు చిరునవ్వు చినుకుగురిసి
సవ్యముగ చూడుమని యిచ్చె దివ్యదృష్టి,
విశ్వరూపంబు జూప నా విశ్వనాథు
డభవమగు రూపమున దాను ప్రభవమందె!

భూ నభంబులు గనరాక భోరుమనుచు
భీకరంబైన శబ్దంబు, చీకటియును
గ్రమ్మ భీభత్సుడంత భీతమ్ము నందె,
అలమె నిశ్శబ్దమంతలో నవధులెల్ల!
మంద్ర స్వరసంద్ర మందు నిర్మాణమంద
ప్రణవ శబ్దాబ్జమందులో ప్రభవమందె,
భుగభుగల మంట లవకాశ భుక్తిజేసి
కోట్ల కాంత్యుష్ణరాసులై గోళులయ్యె!
మొదలు తుదలేవొ తెలియవు, ముఖములెన్నొ
లెక్కబెట్ట నసాధ్యమ్ము, దిక్కులెల్ల
కలసిపోయిన బ్రహ్మాండ వలయమందు
నియత కక్ష్యల దిరుగుచు నిలచెనవియు!
విరియు ఘనశతఘ్ని విముక్త విస్ఫులింగ
విధి నయస్కాంత వలయాన విచ్చుకొన్న
కాంతి పుంజాబ్జమందున కర్ణికై ని
లిచెను గోళమొక్కటి బ్రహ్మ లింగమౌచు!

విడిగబారిన యొక్కొక్క విస్ఫులింగ
మొక్క రవిబింబమై నింగి జుక్కలవగ
నందునొక సూర్యు జుట్టెడి కందుకముల
బుడమిగలదు, దానిం జుట్టు కడలిసుతుడు!
దీపదర్పణములుగాగ దినద శశులు
సప్తసాగర వలయిత సారభూమి
మేరువునుజుట్టు, రవిజుట్టు, మేనుజుట్టు,
పంచభూతంబు లద్దాన బ్రబలుచుండ!
ప్రాణులెన్నియొ పుట్టుచు బ్రాకుచుండె
నంతలో మట్టిపాలౌచు నంతలోనె
మరలబుట్టుచు గతజన్మ మరచుచుండి
ఆడుచున్నారలట బొమ్మలాట వోలె!
భరతవర్షమ్మదె, అదియె భరతభూమి,
అదె కురుక్షేత్ర రణభూమి! అదియెసేన!
మధ్యనిలచిన రథమున మాధవుండు
మాయకాయంబునం బాండుమధ్యు గూడి!

మ్రోగెదుంధుభుల్ , శంఖముల్ , సాగెరణము
కాల్వలై పారు నెత్తుట కత్తులీద
ఘోరకలి డాసెనన సాగె మారణంబు
భీకరోగ్రాగ్ర క్రౌర్యంబు భీతినంద!
అతుల విశ్వంబు తనముందు ఆటయగుచు
ప్రభవ ప్రళయంబులం భయోత్పాతి గాగ
అర్జునుండతి భయమంది అభవునడిగె
తనదు నిజదృష్టి తన కివ్వమనుచు రయము!
పార్థు సందేహ నివృతికి బట్టవిప్పి
గుట్టుజూపిన కృష్ణుండు రట్టు మాపి
పాండుమధ్యము గన్నులు బాహ్యదృష్టి
తిరిగిపొందంగ పలికెను తిరిగి యిటుల!
నీవు బోటుమాత్రమె కాని కావు సకల
సైన్యసంహార సంరక్ష సాధకుడవు,
విశ్వ చతురంగ విభుడ నా వీక్షణముల
నీవు కాకున్న మరియొక పావు కదలు!

కాన భయపూరితాంత రంగమ్ము నందు
భక్తి తాత్పర్య సిత చిత్త రక్తి నింపి
యోగ సంభావితాప్త విరాగ కర్మ
కదనమొనరింపు ధైర్య సంపదను పొంది!

## భక్తి

విశ్వ సందర్శ నౌషధ విగతభీతి
నూరడింబొంది ఫల్గుణుం డురగశయను
నడిగె నిటు కృష్ణ! మరియొక్క టడుగుచుంటి
నెట్టి భక్తుడు నినుబొందు నట్టి ఘనుడు?
మురళి తాల్పంత నిటు బల్కె సరళ భక్తి
యోగమునుగూర్చి- అర్జునా! బాగుమీర
వినుము చెప్పెద సద్భక్తి విధము నీకు
కొలది నియమమ్ము ల న్నన్ను గలియువిధము!
వ్యక్తరూపమ్ము ధ్యానించు యుక్తతముడు,
సంయమంబుల సమబుద్ధి సంచరింప

ధ్రువము నవ్యక్త సత్యమౌ ద్రుహిణవిదుడు
ఇరువురును నన్ను జేరుదు రిద్ధి నిజము!
వ్యక్తి కవ్యక్త చేతసాసక్తి మిగుల
కఠినమౌ క్లేశ సంక్లిష్ట కర్మ గాన
సర్వకర్మలు నావిగా నిర్వహించి
నను సదా ధ్యానమొనరింప గనును ముక్తి!
బుద్ధి మనములు నాకిడ సిద్ధి కలుగు,
శక్తిలేదని యభ్యాస యుక్తి కలదు,
అదియుగాదేని సత్కర్మ నాచరించి
చేరగావచ్చు నను, నేరు దారులివ్వి!
నిరత సత్కర్మ లొనరింప నేరడేని
చేతనంబున నన్నుంచి చింతజేసి
చేతలన్నాకు దత్తంబు చేయవలయు,
చిరము పరమంబునగు నన్ను జేరునతడు!
మమత నద్దియు నోడిన మానవుండు
నన్ను సంఘమ్మునం జూచి సన్నుతించి

సంఘ శ్రేయంబె నా సంతసంబటంచు
నెంచి పనిచేయవలె దాని మంచికొరకు!
విశ్వపురుషాకృతిం దెలిసి నశ్వరాగ్ను
లైన మనుజులు తమ కొద్ది యైహికంబు
ధరణి మానవకల్యాణ పరముజేయ
జాలు నంతమందున నన్ను గలియగలరు!
జ్ఞానమభ్యాసమున గల్గు, దాననతడు
శ్రేష్ఠమౌ ధ్యానమును బొందు, నిష్ఠనొందు,
దాన గర్మఫలత్యాగ మొనరు, దాన
శాంతియొనగూడు, మోక్ష సంక్రాంతి నందు!
సర్వభూతాల బ్రేమించి, సహకరించి,
దయనుజూపించి, విసుగు సంశయము నహము
రాగమును మాని, సమబుద్ధి రక్తిబూని,
సంతత ధ్యానమును గల్గి సాగునెవడు,
లోకమెవ్వాని భీతికి లోనుగాదు,
లోకమును జూడ నెవ్వాడు మోకరిలును,

భయము నుద్వేగమును లోన బడయడెవడు,

పక్షపాతంబు లేనట్టి దక్షుడెవడు,

శుచియు మౌనంబు శ్రద్ధలో జూచునెవడు,

శుభము నశుభమ్ము విడిచిన శుద్ధుడెవడు,

మాయ సుఖదుఃఖ మానావమాన సముడు,

సంగ రహితుండు, నిందా ప్రసంగ సముడు,

ఆశ పాశంబు ద్రెంచు నరేశుడెవడు,

ధర్మ మమృత సమముగ దలచునెవడు,

భువిని సర్వస్వమే నంచు నెవడుదలచి

యుక్తి సేవించు- వాడు నా భక్తుడగును!

## క్షేత్ర క్షేత్రజ్ఞులు

పృథివి జల తేజ వాయు వ్యవధులు మనము

బుధ్యహంకార మవ్యక్త భోగ దుఃఖ

శ్రోత్ర ఘ్రాణముల్ త్వ గ్జిహ్వా నేత్ర చయము

పాద వాక్పాయు పాణ్యుపస్థాది గణము,

స్పర్శ రస గంధ రూపముల్ శబ్ద చేత
నేచ్ఛ ధైర్యముల్ ద్వేషంబు నిచ్ఛ గలసి
మాయ కలగల్పుగాగ నీ కాయమాయె,
అట్టి తనువును క్షేత్రమ్మటంచు నంద్రు!
క్షేత్రమున నేన క్షేత్రజ్ఞు, సూత్రధారు,
నన్ను దెలియంగ దెలియును జ్ఞానమింత,
తన్ను తా పొగడుకొనుట దంభములను
పలుకుటయు గూడ దార్జవం బొలుకవలయు!
క్షమ యహింసల నాత్మ సంయమనములను
గురులసేవయు స్థైర్యంపు గురినిగలిగి
శుచియు సత్యంబు బాటించుచుండవలయు
నింద్రియములేచు కోర్కెల నిచ్ఛ తగదు.
దౌష్ట్యహంకారముల వీడ దగును, జనన
మరణ దుఃఖ జరారుజా భరిత దోష
ములనుదెలియంగ వలయును, చెలగు విషయ
ముల దొలంగవలయు, భక్తి గలుగవలయు!

దార పుత్ర గృహాదుల దగులునట్టి
సుఖము దుఃఖము పెరవారి సొమ్మటంచు
భావనము చేయ వలయును, భావమందు
నిష్టము ననిష్టముల సమనిష్ట వలయు!
ఆత్మభావంబు జ్ఞానమ్ము నాశ్రయింప
వలయు, నేకాంతవాసి కావలయు, మోక్ష
ప్రాప్తిపైపుకె తనదృష్టి పారవలయు
నట్లు కాకున్న యజ్ఞాని యండ్రు బుధులు!
జ్ఞేయమననేదొ తెలియంగ జెప్పుచుంటి,
దేనినెరిగిన మోక్ష సంధాన మగునొ
ఆది సదసత్తరహితం బదేది- అదియ
నిరతిశయమైన బ్రహ్మమం చెరుగుమోయి!
అన్ని దిక్కుల దృక్కులు నాననములు
వీనులుం గాలు సేతులు విస్తరింప
నింద్రియంబులు ద్రిగుణంబు లెల్లభువన
చయముతానయ్యు దనుగాక చనునునిజము!

చరము లచరమ్ము లకును నంతరము, బయలు
సూక్ష్మమై చేరగారాని, చూడరాని
దశ నవిచ్ఛిన్నమై మించి తా శరీర
ములను దాగి సమస్తంబు మోయుచుండు!
ఎల్ల సూర్యాదులకు వెల్గు నిచ్చునదియు
గాఢ యజ్ఞాన తిమిర విఘాతమైన
ప్రాణి సముదాయ మానస ప్రాణమయిన
పరమమ్ముం జ్ఞేయమంచు, నా భక్తు డెరుగు!
ప్రకృతి పురుషు లనాది సంభవులు, సకల
కార్యకారణ కర్తృత్వ కారణమును
గుణవికారాల జనని ప్రకృతిగ దెలియు
మన్ని భవములు క్షేత్రజ్ఞు డనుభవించు!
ఇటుల దేహంబునం బుట్టు యెల్లవాని
భోక్త యుపద్రష్ట భర్తయై పూరుషుండు
ఈశు బరమాత్మ గతిని దానేలుచుండు,
సంగుడై తాను పుట్టుచు జచ్చుచుండు!

ధ్యానమున కొంద రంతర్గతాత్మ దెలియ
కర్మయోగాన కొందరు గాగ సాంఖ్య
యోగమున గొందరెరిగి యా యోగసులభు,
దేహములకంటకుందురీ యిహమునందు!
కాగ మరికొందరితర సత్కాములొసగు
వివరణమ్ముల వినియును, వినియు శ్రుతుల
సంతతోపాసనమ్ముచే చావు గెలిచి
తరలి ననుజేరుదురు నాదు తలుపుదట్టి!
జంగమ స్థావరాత్మక సంఘమెల్ల
ప్రకృతి పురుషుల సంసర్గ ఫలితమగును,
సర్వనాశన మగునెడ సర్వసముని
నాశరహితునిగా జూచు నతడు విదుడు!
ఆత్మగతుడైన పరమాత్ము నన్నియెడల
సమముగాజూచి సద్భక్తి సలుపునతడు
ఉన్నతోన్నతు డుత్కృష్టు డుత్తముండు
మోక్షసామ్రాజ్యలక్ష్మికి భిక్షయతడు!

కర్మలన్నిట ప్రకృతియె కర్తయంచు
దేహధర్మంబు సొంతము దెలియునతడు
తనదు అంతర క్షేత్రజ్ఞు తత్త్వమెరిగి
కర్త తానుగాడని యెరుగంగ జాలు!

భిన్నభూతంబు లొక్కటై యున్నవనియు,
నొక్కగిరినుండి అవియెల్ల పొక్కెననియు,
నది యనాదియు నిర్గుణమ్మవ్యయమ్మ
నెడు నతండు కర్మంబంట నేరడెపుడు!

ఆకసంబెట్లు సూక్ష్మమై అన్నిచోట్ల
నలముకొనియును నొక్కండు నంటకుండు
నట్లె పురుషుండు తనువుల నంటియున్న
కర్మనొక్కట సంబంధి కాడు పార్థ!

రవియొకండెట్లు జగమెల్ల రంగులీను
దేహములనెల్ల పురుషుండదే విధంబు
ప్రభల జిమ్మును తెలియుము పార్థ! ఈ వి
షయమునెరిగిన జేరు విశ్వాత్మ నరుడు!

## క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము సంపూర్ణము.

### గుణత్రయం

జగతి బుట్టువులకునెల్ల జనని ప్రకృతి,
జనకుడను నేను, నా యాన జనుసు ప్రకృతి,
పురుషు సత్త్వ రజ స్తమంబులను మూడు
ప్రకృతులీ క్షేత్రమందున బాతియుంచు.
స్వచ్ఛమౌ నిర్మలంబౌ నిజచ్ఛటా వి
కాసమున నుపద్రవ రహితాసమాన
సత్త్వ సుగుణము క్షేత్రజ్ఞు సంతసమున
సుఖమునం జ్ఞానమును జేర్చి శోభగూర్చు!
తాప సంగోద్భవంబై సదానురక్తి
రథమునం బూరుషున్నిల్పి, పథమునైన
జూపి చూపక బలిమి రజోగుణంబు
కదలదోలును కర్మ సంగరము వైపు!
తామసంబద్ధి యజ్ఞాన సీమబుట్టి
మోహకరమైన మంత్రమై దేహధరుల

తగని నిద్దుర సోమరి తనము మరపు
బద్ధకములందు పడవేయు శ్రద్ధతోడ!
ఇందునేదేని యొక గుణమ్మితరములను
పైకిరానీక నిబ్బరంబగుట పాటి,
ప్రబలు విజ్ఞతా మోహ లోభములు వరుస
మూడు గుణముల మొనగత్తె ముఖముదెల్పు!
సత్త్వగుణమొండు మెండైన స్వర్గమందు,
మానసము రాజసంబైన మనుజులందు,
మురుగ దామస గుణమందు మూఢయోను
లందు బుట్టుదురోయి జన్మాంతమందు!
జ్ఞానప్రాప్తిని సాత్త్వికమైన కర్మ,
దుఃఖ ప్రాప్తిని రాజస దోర్బలమ్ము,
మౌఢ్య ప్రాప్తిని తామస మలినకర్మ
ఫలితముగనిచ్చు మనుజుని బ్రతుకునందు.
సాత్వికులకూర్ధ్వమును, రాజసాత్మకునకు
మధ్యమ స్థానమును, నధో పథము తామ

సాత్ములకు బ్రాప్తమగు, తన్ను సాక్షిగను, గొ
నములు కర్తగను నెరుగ నన్ను జేరు.
మున్ను చెప్పిన గుణముల మూటిగడచి
తన యదార్థంబు దెలిసిన తనునివాసి
జనన మరణ జరారుజా జాత దుఃఖ
ముల మనంబును వీడి యమృతము బొందు!
మూడు గుణములు తన చుట్టు మూగుగాక,
మూడు కర్మల ద్వేషంబు బూనడతడు,
కావలయునంచు వాటిని గావలింప
డాతడే త్రిగుణాతీతు డనెడు వాడు!
ద్వంద్వ సము డశ్మ హేమ మృత్సముడతండు
నిశ్చల స్వస్థుడతడు తా నిర్మల హృది
భక్తిభావంబుచే నాకు బ్రణతుడైన
బ్రహ్మ భావంబునొందు బ్రభావమొందు!
పతనము వికారమును లేని బ్రహ్మమునకు,
శాశ్వతంబగు ధర్మ సుజ్ఞానమునకు,

పొందు మరియొందు లేని యానందమునకు
నాశ్రయంబైన వాడ నేనౌట- నటుల!
గుణత్రయ విభాగ యోగము సంపూర్ణము.

## పురుషోత్తమ ప్రాప్తి

తిండి తిప్పలు కతికెడు దండి వేళ్ళు
ఎగువనుండగ, కొమ్మలు దిగువ వ్రాలు,
బలము దెలివియు నాకుల నలముకొనగ
తిరుగబడినట్టి యశ్వత్థ తరువు తనువు!
త్రిగుణ బలమున విషయాల చిగురుదొడిగి
మనుజు గర్మానుబంధిగ మలచు దనువు,
మూలమున సంగమను గట్టి కోలతోడ
త్రవ్వి పరమాత్ము కొరకు వ్రతమ్ము సలిపి
ముదము నధ్యాత్మ నిష్ఠులై మోహమాన
రహిత జితసంగ దోషులౌ రాగముక్తు

లవ్యయంబైన పదము నలంకరించి

మరల జన్మంబు లేనట్టి పరముగాంత్రు!

అపరమౌ జ్ఞాన ధగధగ నమరునైన

నాదు మాయాంశ జీవమై నవసుమాల

గంధవాహునివలె బొంది గదుల దూరు,

వెలువడు నిల నింద్రియ మనోవితతి తోడ!

చర్మమున నంటు, చెవులందు శబ్దములును

కనుల రూపమ్ము, నాలుక గమ్మరుచుల,

ముక్కుతోడ సువాసనల్మెక్కు జీవు

డాడు మనమున బందియై కాడుమరచి!

దేహమును వీడుచున్నట్లు గేహమందె

యనుభవించుచు నున్నట్లు, గుణునియట్లు

జీవు గనుగొను సుజ్ఞాన భావుకుండు,

కానగాలేడు మూఢ వికార జితుడు!

భూమియందున యోషధీ భోజనమును

పండజేయుచు నందుండి గుండెనిండి

నడుపుచున్ కుక్షి జఠరాగ్ని నౌచు తిండి
జీర్ణమగునట్లు నిరతంబు జేయుచుందు!
సకల దేహాళినందురు క్షరమటంచు,
దేహములదాల్చు కూటస్థు దీప్తిబిల్తు
రక్షరంబంచు నింక విలక్షణమును
నుత్తమమునంద్రు నన్పురుషోత్తముడని!
పురుషోత్తమ ప్రాప్తి యోగము సంపూర్ణము.

## దేవాసురులు

ఉత్తమంబగు మనుజుల చిత్తవృత్తి
వినుము చెప్పెద నర్జున వీనులొగ్గి
భయము క్రోధము లజ్జ చాపల్యములను
కావర వికారముల నెల్ల గాలరాయు!
సత్య చిత్తోపశమనముల్ సర్వసంగ
ములవిరక్తి, తపము, దానము, మనమందు
శుద్ధి, బహిరింద్రియమ్ముల సిద్ధి, బుద్ధి,

ధైర్యము, మృదుత్వ సుక్షమా శౌర్యములను
కలిగియుందురు, సేతురు క్రతువుల, శ్రుతి
శాస్త్రముల బఠింతురు శ్రద్ధ, సత్తములగు
యితరులకు హింస వంచనయు తలపెట్ట
రట్టివారలు తెలివిని గట్టివారు!
బ్రతుకు తెరువున న్యాయమ్ము గతుకుబాట,
అనుభవించర, చేయర అప్పటంచు,
ఉత్తముల ధర్మసూత్రముల్ రిత్తటంచు
దిరుగుదురు నీచ మనుజులు నరకమందు!
కలుగు బలభాగ్య భోగాల కర్తనంచు
నింత యార్జించితిని నేనొకింత యింక
నార్జనము చేయబోవు చున్నాడ నివియు
నావి, నా స్వంత మనుకొను నతడసురుడు!
డంబ గర్వాభిమాన క్రోధంబులు నవి
వేక పరుషము లివియారు లేకిసొత్తు

లవగ నీవు సదంశ సంభవుడవయ్య,

మైలబడెదవు గ్లాని నీకేలనయ్య!

క్షుద్రకర్మల దొరలెడు ఛిద్రపాత్ర,

మోక్ష కబళంబు బట్టని భిక్షపాత్ర,

మేన మైకంబు తన్నెడు పానపాత్ర

జీవుడిలపైన ధరియించు చెడుగుపాత్ర!

కామ క్రోధ లోభమ్ముల గనలజేసి,

శాస్త్రవిహిత కర్మలనెల్ల సమ్మతించి

నాదు వాక్యంబు బాలించి నారి గొనుము

ధర్మ రక్షణమున నీదు ధర్మమిదియ!

దైవాసుర సంపద్విభాగ యోగము సంపూర్ణము.

## శ్రద్ధాత్రయం

అనెడు పరమాత్మ పలుకుల కర్జునుండు

శాస్త్రవిధి మానియును నిన్ను శ్రద్ధబూని

సన్నుతించెడి వారల దన్నుగూర్చి
తెలుపుమన దెల్పె నంత నా నలుపువేల్పు.
మనుజు నంతఃకరణమున కనువుగ మది
శ్రద్ధబుట్టును, అదియు త్రయోద్ధతులను
దాల్చి సాత్విక రాజస తామసముల
పేర్లనుండును, మనుజుడా పేర్లబరగు!
సాత్వికులు దేవతల, రాజసాళి యక్ష
రాక్షసుల, దామసులు ప్రేత రౌద్ర భూత
ములను శ్రద్ధతో బూజింతురిలను, కాగ
ఘోరతపముల గృశియింత్రు క్రూరజనులు!
త్రిగుణములగూడి తిండియు ద్రివిధమాయె,
తపము దానము యజ్ఞము ల్దనరె నటులె,
తారతమ్యంబులంగూర్చి తనముగూర్చి
వినుము నే జెప్పెదను పార్థ! వివరముగను.
రస్య సుస్నిగ్ధ హృద్య స్థిరమ్ములై బ
లాయురారోగ్య సత్త్వంబు లధికమవగ

సాగుజేసెడి యశనమ్ము సాత్వికులకు
తృప్తిగలిగించు, నిష్టసంప్రాప్తి నొసగు!
చేదు పులుపుప్పు కారముల్ మీదుమీరు
వాడిదినుసులు, మిక్కిలి వేడిజేయు
నట్టివియు, పంట గొరుకంగ గట్టివియును,
రాగకరముల దిందురు రాజసికులు!
చల్లబడినది, చెడినది, చద్ది, చప్పి,
దెంగిలిది యిట్లు చెడుకూళ్ళు మ్రింగుచుందు
రెలమి దామస ప్రకృతులు చలముదక్కి
మత్తుపానంబు జేతురు చిత్తుగాను!
శాస్త్రనిష్కామ యజ్ఞమ్ము సాత్వికమ్ము,
రాబడిని పేరు కోరంగ రాజసమ్ము,
తప్పు, క్షుద్రమ్మసహ్యమ్ము తామసమ్ము,
శ్రద్ధలేనట్టి కోర్కుల క్రతువుగాన!
దేవ బ్రాహ్మణ గురు ప్రాజ్ఞ దీవనముల
కోరుటయు, శౌచపాలన, నేరుచూపు,

బ్రహ్మచర్యంబహింసయు ప్రవర వృత్తు

లాచరించుట దైహికమైన తపము!

నిజము వినసొంపుగా జెప్పునేర్పు, కూర్పు,

వాఙ్మయాభ్యాసమును గూడ వాచ్యతపము,

నిర్మలత్వంబు, మంచియు, నిగ్రహంబు,

నాతి మౌనమ్ము గలియ మనోతపమ్ము!

మూడు విధముల శ్రద్ధతో గూడు తపము

సాత్త్వికంబైన బడయదు సాదమింత,

రాజసంబైన విహరించు రంగుకలల,

తామసంబైన బీడించు దన్ను బరుల!

దేశ కాలంబులంబట్టి దేహియొక్క

పాత్రతాపాత్రతల్ చూచి ప్రతిఫలాశ

మాని యిచ్చిన సాత్త్విక దానమగును,

తోన నర్పింప రాజస దానమగును!

సమయ సందర్భములు లేక చచ్చు పుచ్చు

పాత్రలకు నాదరము లేక పాడుబుద్ధి

నొకరి నవమాన పరుపగా నొసగునట్టి
దానమును తామసమ్మండ్రు ధరణిలోన!
శుద్ధ సత్యము నెరుగుము శ్రద్ధతోడ
నన్నుజేరుము సత్త్వమున్ సన్నుతించి,
మున్ను నాచేత తొలినుడుల్గొన్నయట్టి
పలుకు లోం తత్సదులు మూటి ఫలములెరిగి!
శాస్త్ర సమ్మతమైన యజ్ఞాల మొదల,
తపము దానాదులం జేయునపుడు మొదట
అందురోంకారమున్ జ్ఞానులంద రిలను,
తత్సదంబిచ్చు ఫలము పరాత్పరునకు!
కర్మలన్నిష్ఠ, యర్పణ, ధర్మచింత
సత్త్వ శ్రేష్ఠత్వముల దెల్పు సత్పదమ్ము,
శ్రద్ధలేనట్టి కర్మ యసత్తనంగ
నిహ పరంబుల సుఖముల నీయలేదు!

శ్రద్ధాత్రయ విభాగ యోగము సంపూర్ణము.

## మోక్షసన్న్యాసం

ఇంక నీలోన మిగిలిన శంకదీర

త్యాగ సన్న్యాస తత్త్వాల తనము వినుము

యాగములపంట వీడుచో త్యాగమగును,

కాసులిడు కర్మలొదల సన్న్యాస మగును!

ఆత్మ దప దాన యజ్ఞాలు ఆశవిడిచి

జరుపవలె నిద్ధి నా యాజ్ఞ జనులకెల్ల,

నిత్య నైమిత్తికంబైన నీతి సహిత,

వేదబోధిత సత్కర్మ విడువరాదు!

మోహపాశాన దగిలి తమోవిపాక

దశను జేసిన త్యాగమ్ము తామసమ్ము,

తనువుకాయాస మగునని దడిచి, సొలుపు

రాగజేసిన త్యాగమ్ము రాజసమ్ము,

రక్తి, ఫలితముల్విడిచి వేదోక్తమైన

నిత్య విధి విధానమ్ముల సత్యమనుచు
నమ్మిచేయంగ, నలరింప దమ్మిచూలి
నదియె సాత్విక త్యాగ మనెదరు బుధులు!
దేహి కర్మాబ్ధి నడిబొడ్డు తెట్టుగాన
కర్మజేయక మనలేడు, మర్మమెరిగి
సాత్త్వికత్యాగ నిరతుడై సంశయమ్ము
గడచువాడు కర్మత్యాగియై చరించు!
ప్రియములప్రియమ్ములు ప్రియాప్రియము లనగ
కర్మఫలములు జన్మాంత కాలమందు
గవిసి యణచు కర్మత్యాగి కానివాని,
అంటజనవు కర్మత్యాగి యైనవాని!
కాయ కర్తలు, పండ్రెండు కరణములును,
కరణకర్మలు, దైవ సంకల్పమున్ను
కారణములైదు తెలియుమీ కర్మతతికి,
మంచి చెడుగుల భేదంబు లెంచదగదు.

నరుని నడపించు యిక్కారణములకెల్ల
కర్తనై యుండగా తాన కర్తనంచు
తలచువాడొట్టి మూర్ఖుండు, తెలివిమాలి
వేదభువిపైన నడయాడు వింతపశువు!
అహముజెందక, కర్మఫలాశ లేక
జనులనందర జంపియు మనుజుడిలను
హంతకుడు గాడు, పాప మొక్కింత గొనడు,
ఇందు సందేహ మింతయునొంద వలదు!
తెలివియును, తెలియునదియు, తెలియువాడు
మూడు చోదకశక్తులీ మొత్తమునకు,
భిన్నభూతంబుల న్నొక్క బిందువట్లు
చక్కజూచెడు జ్ఞానంబు సాత్త్వికంబు,
భేదభావాన భూతాల భిన్నములుగ
రకరకాలుగ జూచుచో రాజసమ్ము,
ఆత్మయన దేహమాత్రమ్మటంచు దలచి
తప్పుటంచనా వేయంగ తామసమ్ము!

హితము, సుంతఫలాశ రహితము, మితము,
సత్యమౌ స్వచ్ఛకర్మంబు సాత్త్వికమ్ము,
పూజలందగ శ్రమియింప రాజసమ్ము,
తరమెరుంగక చెమటోడ్చ తామసమ్ము!
ధైర్య ముత్సాహముల గూడి దార పుత్ర
బంధు మిత్రాదులందు సంబంధిగాక
జయము నపజయమ్మును లెక్క సలుపనట్టి
దర్పరహితుడు సాత్త్విక ధర్మకర్త.
రాగబంధి, యనాచారి, భోగవశుడు,
రాలుబడి గోరి కర్మల నేలువాడు,
ముదము గ్రీడించి వెతలందు మూల్గువాడు
సాజ హింసాత్ముడగు కర్త రాజసుండు.
పరుల నవమాన పరచెడు పరువులేని
మోస మవివేక మాంద్యాల మూసకట్టు,
బద్ధకస్తుడు స్తబ్ధుడు, శ్రద్ధలేక
దడుపునైజము గల కర్త తామసుండు.

వినుము బుద్ధియు, ధైర్యము గనగ మూడు
విధములైయుండు, నందు సద్విధిని సాత్త్వి
కమగు బుద్ధి భయాభయ కర్మగతుల
మోక్ష కర్తవ్యమున్ బంధమోక్ష మెరుగు.
ధర్మమెద్దియొ చర్చింప దగనియట్టి,
చేయదగినట్టి తగనట్టి చెయ్యిదముల
తెలియలేనట్టి దది రాచ తెలివియగును,
తగ నిషిద్ధంబ నిజమను తామసమ్ము!
కర్మయోగాన తలపుల గట్టివేసి
మనసు ప్రాణేంద్రియ క్రియలను నియమించి
చెలగు ధైర్యంబు సాత్త్విక బలము గలది,
ఫలముగోరంగ నది రాచ బలముగలది.
నిద్ర యేడుపు పిరికియు క్షుద్రమైన
దిగులు కావరముల గూడి తెగులునొంది
కుత్సితంబగు బుద్ధుల గూడియున్న
శౌర్యరహితంబదియ తమోధైర్యమగును.

ధరణి సుఖమును మూడువిధాలు వినుము
దొసగు దుఃఖమ్ము మాన్చి సంతసము నొసగు
మొదట కష్టమై తుదబెద్ద ముదముగూర్చు
విమల బుద్ధిని గలుగు సాత్త్విక సుఖంబు,
విషయముల గూర్చుచు తుదకు విషదమగుచు
మొదల రుచినిచ్చు రాజససదన సుఖము,
పిడుగుపాటుగ స్వప్నాది పీడలందు
భ్రమను గల్పించు తామస ప్రభవ సుఖము.
దివిజ మానవ రాక్షస భువనములను
భ్రమసి త్రిగుణాల దగులని ప్రాణిలేదు,
బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్ర వ్యవస్థ
పురుషు గుణకర్మలంబట్టి పుట్టెనంటి!
గుణములంబట్టి విడిన బ్రాహ్మణుడు జగతి
నేలు, నను నమ్ము, తనదైన వీలునెరుగు,
ముక్కుసూటిగ తన పథమ్ము ననె కదలు,
కపటమార్గంబు ద్రొక్కడు, తపము సలుపు,

బయటి లో నింద్రియాలకు బంటుకాడు,
శుభ్రముగనుండు, మానస శోధనమ్ము
సలుపు, రానోపు నెంతటి సలుపునైన,
చదువు లనుభవముల విద్దెలొదవ జనును.
క్షత్రియుడు ధైర్యవంతుడు, శౌర్యమతుడు,
తేజసామర్థ్యములు భుజ ద్వితయమవగ
జనులబాలించు సమదర్శి, సత్యవ్రతుడు,
అనిమొనన్ వెనుబారడు, దానపరుడు!
గోగణమ్ముల గాయుచు కోమటీడు
పంట పండించి జగతికి బంచువాడు,
శూద్రుడన నెల్ల తెగలకు నొలపులేక
శ్రమను దానమ్ము జేసెడు శ్రామికుండు!
ఎవ్వరెవరెట్టి కర్మల కియ్యకొందు
రట్టికర్మల వారు చేపట్టి గట్టి
చిత్తమున నా స్వధర్మంబు విత్తప్రీతి
లేక పాటింప వారలు నాకు ప్రియులు.

తనదు ధర్మంబు తక్కువ దైనదంచు
పరుల ధర్మంబు ఘనమంచు బ్రాకులాడు
పామరాళిని గబళించు పాపరాశి,
తాను చేపట్టు ధర్మంబె తనకుగొప్ప!
ఎల్లకర్మల దోషాల పొల్లు కప్పు
నిప్పు గప్పెడు నివురట్లు నింతొనంతొ,
దోషయుక్తమ్మటంచు తా దూషణముల
జేయగారాదు తనపైన నియమములను.
కనుక నాశల వర్జించి, కర్మఫలము
విడిచి, నైష్కర్మ్యసిద్ధిని గుడిచి, బలిమి
చిత్తమందలి తికమక చిక్కబట్టి
మిగుల సుజ్ఞాన నిష్ఠుడ వగుము పార్థ!
శిథిలములగూర్చి బాధ సన్నిధికి జనక,
అందరానట్టి వానికై కుందువడక,
సకల ప్రాణుల సమదృష్టి సాకగలుగు
బ్రహ్మనిష్ఠుడు జ్ఞానియై ప్రాప్తినొందు!

నీవు నీ చేయు కర్మలు నీవియనక,
నన్నె యుత్కృష్టగతి యంచు నమ్మి నాకు
నిండుమనమునొసంగి వేరొండు తలపు
మాని సుఖియింపు, లేదని మనుటవమ్ము.
నీదు తలమీదనే పోరు లేదు పార్థ!
రగులునది నాదు యానపై, తగుదునంచు
విల్లు పడవైచినంతనె చెల్లదోయి,
నీ స్వభావమ్మె బరిమీద నిల్పెనన్ను!
భ్రమలగురిజేసి మాంత్రిక వరునిరీతి
ప్రాణులన్నిటి మానసాభ్యంతరమున
నిలచి యాడించు పరమాత్మ నెలవుగోరి
సర్వముంద్యాగ మొనరించి శరణువేడు!
నీరసమువీడి నేజెప్పు నిజము దెలిసి
నన్నె శరణంచు హృదయాన నన్నె నిలిపి
సర్వధర్మాల నా కిడి చలముగొనుము,
నీకు మోక్షంబునిచ్చెద నిక్కువంబు!


జ్ఞానదాయకమైన యీ శాస్త్రబోధ
నన్ను నమ్మనివారికి, నన్నుదెలియు
శ్రద్ధలేనట్టి వారికి, బుద్ధియం ద
సూయ సుడివేయు వారికి జేయరాదు!
చెవుల జేవులూరు నట్లు నే జెప్పినట్టి
సుప్రసిద్ధ విజ్ఞానంబు సుజనతతికి
చెప్పి ననుజేరు సౌభాగ్య సిద్ధిగలుగ
జేయ ననుజేరు, మరుజన్మ జేరడతడు!
ఈ మనిద్దరి సంభాషణముల బండి
నట్టిదౌ జ్ఞాన రసమును గట్టి మనము
నందు బారించి సత్కర్మ నాచరించు
వారు పుణ్యాత్ము లెలమి నావారు వారు!
నీవు ఏకాగ్రచిత్తతన్ జీవితంబు
నెరిగితివి గాదె! అవివేక మేగెగాదె!
ఇప్పుడేమందువని శౌరి చెప్పుమనగ
నర్జునుడు జేసె నవసింహ గర్జనంబు!

తొలగె నవివేకమున్ జ్ఞానబలము గలిగె,
విగత సందేహినైతి నో విశ్వపురుష!
నీదు యానతి బాటింతు నిక్కముగను
అనుచు గాండీవమును బూనె నని నతండు!

ఎచట యోగబోధలు సాగు, నెచట సాగు
విహిత కర్మలు బహు నిష్ఠ సహితమగుచు
నచటె యోగీశ విజయులు, అచటె నీతి,
అచటె ధనప్రాప్తి, యైశ్వర్య మచటె నిజము!

మోక్ష సన్న్యాస యోగము సంపూర్ణము.

ఇది విజయగీత యను భగవద్గీత ఆంధ్రానువాద గ్రంథము.


rachanaonlinetyping.in
మీ రచనలు, సేకరించినవి మాకు పంపండి. ఇందులో ప్రచురిస్తాం
తెలుగు భాషకోసం - తెలుగు ప్రజల కోసం అక్షరాభిషేకం
8919951771
9494421527
9441318641
రచయితలు సంప్రదించండి
• మెయిల్ ఐడి : kamyasiddhi@gmail.com
website: rachanaonlinetyping.in